

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్, తదితరులు

## సమాచార హక్కు చట్టానికి కేంద్రం తూట్లు

### చట్టంపై గ్రామీణ స్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాలి

### రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్

ఖైరతాబాద్, అక్టోబర్ 12 : ప్రజల హక్కులను పరిరక్షించే సమాచార హక్కు చట్టానికి కేంద్రం తూట్లు పొడుస్తున్నదని రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు దినోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్ హాజరై ప్రసంగించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమాచార హక్కు చట్టం నిర్వీర్యం కావడం ప్రారంభమైందన్నారు. సమాచార హక్కు చట్టంపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు బోధించాలన్నారు. సభాధ్యక్షత వహించిన డాక్టర్ వల్లె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో పారదర్శక పాలన కొనసాగుతున్నదని, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, రాష్ట్ర ప్రజల హక్కులు కాపాడుతూ వారు ఆత్మగౌరవంతో జీవించేలా పాటుపడడం ఆదర్శనీయమన్నారు. సమాచార హక్కు చట్టంపై ఇంకా అవగాహన పెరగాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. అనంతరం సమాచార హక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చట్టం ద్వారా పొందే హక్కులు, న్యాయం తదితర అంశాలతో రూపొందించిన కరపత్రాలు, పుస్తకాన్ని అతిథులు డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్, డాక్టర్ వల్లె వెంకటేశ్వర్లు, మాజీ హైకోర్టు జస్టిస్ భవానీప్రసాద్, రిటైర్డ్ కలెక్టర్ ముత్యేశ్వర రావు, మాజీ సీబీఐ అధికారి బాలకిషన్‌రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ ఉషారాణి, నగర కన్వీనర్ కోంశంపేట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## 9999కు రూ.15.53 లక్షలు

### ఆన్‌లైన్ ఫ్యాన్సీ బిడ్డింగ్ ఆదాయం రూ.41.86లక్షలు

### జేటీసీ పాండురంగ్ నాయక్

సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ) : ఖైరతాబాద్ ఆర్టీఓ పరిధిలో ఫ్యాన్సీ నంబర్ల బిడ్డింగ్‌లో టీఎస్09 జీడీ 9999 నంబర్‌ను రూ.15.53 లక్షలకు ముప్ప హోమ్స్ కంపెనీ దక్కించుకున్నది. మరో నంబర్ టీఎస్ 09 జీఈ 0009ను రూ.3.29లక్షలకు గీత ఆటోమోటివ్ కంపెనీ కైవసం చేసుకున్నది. 0001 నంబర్‌ను రూ.3లక్షలకు శ్రీనివాస్ బాబు దక్కించుకున్నారు. ఇలా ఫ్యాన్సీ నంబర్లతో మొత్తం రూ.41.86లక్షల ఆదాయం ఆర్టీఏ ఖజానాకు చేరిందని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పాండురంగ్ నాయక్ తెలిపారు.

## నేడు క్యాన్సర్‌పై అవగాహన వాక్

సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ) : ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖాన ఆధ్వర్యంలో గురువారం ఉదయం 7గంటలకు అవగాహన వ్యాక్ నిర్వహించనున్నట్లు ఎంఎన్‌జే డైరెక్టర్ డాక్టర్ జయలత తెలిపారు. లుంబినీ పార్క్ వద్ద నుంచి ప్రారంభమై 8గంటలకు రవీంద్రభారతి చేరుకుంటుందన్నారు. క్యాన్సర్ వ్యాధి నివారణ, క్యాన్సర్ కారకాలు తదితర అంశాలపై ఉదయం 9 నుంచి 11గంటల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### శంషాబాద్ ఎయిర్‌పోర్టులో

## ఫిజిటల్ ల్యాబ్ ప్రారంభం

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 12: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జీఎంఆర్ ఏవియేషన్ అకాడమి గ్రామ సైబర్ సెక్యూరిటీతో కలిసి గురువారం అనాలసిస్ సెంటర్(ISAC) తో పాటు మొదటి రకం ఫిజిటల్ ల్యాబ్‌ను ఎయిర్‌పోర్టు అధికారులు ప్రారంభించారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఫిజిటల్ ల్యాబ్‌తో ప్రపంచ ప్రత్యర్థుల నుంచి నిరంతరం అభివృద్ధి చెందుతున్న సవాళ్లను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఆవిష్కరించినట్లు తెలిపారు. ఫిజిటల్ ల్యాబ్ ఒక వెలుగు రేఖగా నిలుస్తున్నదని వివరించారు. సైబర్ సెక్యూరిటీ టీమ్‌లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం కోసం అందుబాటులో ఉంటుందన్నారు.

# బొనాంజా వచ్చింది.. పండుగ తెచ్చింది

### నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే ఆధ్వర్యంలో..

### మూడవ రోజు ఐదుగురు లక్కీడ్రా విజేతలు ఎంపిక

సిటీబ్యూరో/ అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ)/ మారేడ్‌పల్లి : కొనుగోలుదారుల ఇండ్లలో పండుగకు ముందే ''నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే'' గిఫ్టు సంబురాలు మొదలయ్యాయి. నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఈనెల 18వరకు నిర్వహించే దసరా షాపింగ్ బొనాంజా కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం మూడవ రోజు ఐదుగురు లక్కీడ్రా విజేతలను ఎంపిక చేశారు. ఈ వేడుకల్లో భాగంగా సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని సీఎంఆర్ ఫ్యామిలీ షాపింగ్ మాల్‌లో మూడవ లక్కీ డ్రాను నిర్వహించారు. వినియోగదారులు, స్పాన్సర్ల సమక్షంలో సీఎంఆర్ ఫ్యామిలీ షాపింగ్ మాల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.సత్యనారాయణ, హోప్ అడ్వర్టయిజింగ్ డైరెక్టర్ కేఎస్ రావు, నమస్తే తెలంగాణ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, నమస్తే తెలంగాణ అడ్వర్టయిజ్‌మెంట్ విభాగం ఏజీఎంలు రాజిరెడ్డి, రాములు, మేనేజర్ సందీప్ చేతుల మీదుగా ఐదుగురు విజేతలను ప్రకటించారు.



లక్కీడ్రాలో విజేతలను ప్రకటిస్తున్న ఆయా సంస్థల ప్రతినిధులు కె.ఎస్ రావు, ఎ.సత్యనారాయణ, ప్రవీణ్‌కుమార్

### లక్కీ డ్రా విజేతలు వీరే..

సికింద్రాబాద్ ప్యాట్నీ చౌరస్తాలోని సీఎంఆర్ ఫ్యామిలీ షాపింగ్ మాల్‌లో నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే సంయుక్తాధ్వర్యంలో తీసిన లక్కీ డ్రాలో మొదటి బహుమతి 32 ఇంచుల టీవీ ఆదిశేషు గెలుచుకున్నారు. రెండవ బహుమతి మొబైల్ ఫోన్‌ను విజయ్, మూడవ బహుమతి మైక్రో ఓవెన్‌ను వి.ఓంకారం, నాల్గవ, ఐదవ బహుమతులు గిఫ్ట్ ఓచర్‌లను జి.సత్తయ్య, జగదీశ్ గెలుచుకున్నారు.

### షాపింగ్ చేయండి.. లక్కీ డ్రాలో పాల్గొనండి



అందరూ మెచ్చే విధంగా, వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను సరసమైన ఆఫర్లతో తక్కువ ధరకే అందిస్తున్నాం. దసరా పండుగ సందర్భంగా ''నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే'' ఆధ్వర్యంలో దసరా షాపింగ్ బొనాంజా నిర్వహించడం, అందులో సీఎంఆర్ భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉన్నది. చిన్నారులు, మహిళలకు ప్రత్యేకంగా రకరకాల దుస్తులను రూ.200 నుంచి మొదలుకొని అందుబాటులో ఉంచాము. 16 సీఎంఆర్ బ్రాంచ్‌లు ఉన్నాయి. షాపింగ్ చేయండి.. లక్కీ డ్రాలో పాల్గొనండి.. బంపర్ డ్రాలో కారును కూడా గెలుచుకోవచ్చు.

- ఎ.సత్యనారాయణ, మేనేజింగ్ డైరెక్టర్, సీఎంఆర్ ఫ్యామిలీ షాపింగ్ మాల్ తెలంగాణ

### చొరవ అభినందనీయం



''నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే'' ఆధ్వర్యంలో కొనసాగుతున్న దసరా షాపింగ్ బొనాంజాలో క్రియేటివ్ పార్టనర్‌గా వ్యవహరిస్తున్నాం. పారదర్శకంగా.. ఇలా ప్రతిరోజు అందరి సమక్షంలో డ్రా తీయడం నిజంగా అభినందనీయం. ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించడం ఇటు కొనుగోలుదారులకు, అటు ప్రకటన దారులకు ఎంతో మేలు చేకూరుస్తుంది.

- కె.ఎస్ రావు, హోప్ అడ్వర్టయిజింగ్ డైరెక్టర్

### పదేండ్లుగా బొనాంజా కొనసాగిస్తున్నాం



గత పది సంవత్సరాలుగా ''నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే'' ఆధ్వర్యంలో దసరా బొనాంజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రతి రోజు లక్కీ డ్రాలో ఐదుగురు చొప్పున విజేతలను ప్రకటిస్తున్నాం. ఈ బంపర్ డ్రాలో కారును గెలుచుకునే అవకాశం ఉంటుంది. ఇంతటి మంచి కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

- ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్, నమస్తే తెలంగాణ



'రైస్' ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభిస్తున్న ఏఐజీ హాస్పిటల్ చైర్మన్ డా.నాగేశ్వర్‌రెడ్డి , తదితరులు

## ఏఐజీలో 'రైస్' ప్లాట్‌ఫామ్

సిటీబ్యూరో, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ) : రొమ్ము క్యాన్సర్‌ను జయించిన వారు తమ అనుభవాలను పంచుకోవడమే కాకుండా వైద్యుల సలహాలు, సూచనలు పొందడం కోసం ఈ 'రైస్' ప్లాట్‌ఫామ్‌ను రూపొందించామని ఏఐజీ హాస్పిటల్ చైర్మన్ డా.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం దవాఖానలో కొత్తగా రూపొందించిన రైస్ ప్లాట్‌ఫామ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రేడియో అంకాలజిస్టు డా.నందిత శశికిరణ్, బ్రెస్ట్ క్యాన్సర్ స్పెషలిస్టు డా.ప్రజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.

# సెంచరీ కొడుతాం.. మళ్లీ అధికారంలోకి వస్తాం

### ఈ నెల 18న మేడ్చల్‌లో సీఎం కేసీఆర్ బహిరంగ సభ

### 60వేల పై చిలుకు తరలివస్తారని అంచనా

### ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద్

మేడ్చల్, అక్టోబర్ 12 (నమస్తే తెలంగాణ) : మేడ్చల్‌లో ఈ నెల 18న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వి కన్వెన్షన్ సమీపంలో జరుగనున్న సభా స్థలి ఏర్పాట్లను మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. సుమారు 50 ఎకరాల స్థలంలో నిర్వహిస్తున్న సభకు సుమారు 60వేల పైచిలుకు ప్రజలను తరలించే విధంగా ప్రణాళికను రూపొందిస్తున్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.



సభ ఏర్పాట్లపై ముఖ్య నాయకులతో సమావేశమైన మంత్రి మల్లారెడ్డి

### సెంచరీ కొట్టడం ఖాయం

రానున్న శాసనసభ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ పార్టీ సెంచరీ కొట్టడం ఖాయమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడం ఖాయమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అంటే ప్రజలకు ఇంటి పార్టీగా మార్చుకున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరిస్తున్నారని, వాళ్లకు ఓట్లు వేస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి పార్లమెంట్‌కు ఏం చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి బీఆర్ఎస్ ఇస్తున్న అన్ని పథకాలను నిలిపివేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, తూకుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్, మేడ్చల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, మేడ్చల్ ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు నందారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, నాయకులు మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్‌యాదవ్, శేఖర్‌గౌడ్, మల్లికార్జునస్వామి, భాగ్యారెడ్డి, సర్పంచులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.